

అరసవల్లి ఆలయం మూసివేత



ప్రధాన ద్వారాన్ని మూసివేస్తున్న ఆలయ సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్ : శ్రీశోభకృత్ నామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి శనివారం రాత్రి అశ్విని నక్షత్ర యుక్త రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం కావడంతో శనివారం సాయంత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని మూసివేశారు. నిత్యార్చనలు, నివేదన పూర్తి చేసి రాత్రి 7 గంటల సమయంలో అర్చకులు మూసివేశారు. గ్రహణానంతరం సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాలు పూర్తి చేసిన తర్వాత ఆదివారం ఉదయం 7 గంటల నుంచి తిరిగి ఆలయ ప్రవేశం కల్పిస్తావ ని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. యాత్రికులు ఈ మార్పును గమనించాలని సూచించారు.

హామీలను అమలు చేయాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఇచ్చిన వాగ్దానం అమలు చేస్తారో? ఇచ్చిన హామీని భంగం చేస్తారో తేల్చి చెప్పాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అడుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం ప్రశ్నించారు. రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన జగనన్న వాగ్దాన భంగాన్ని నిరసిద్దాం పేరిట కార్మికులు శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు సిఎం జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ అనే తేడా లేకుండా పర్మినెంట్ చేస్తానని హామీనిచ్చారని గుర్తు చేశారు. నాలుగున్నరేళ్లు గడచినా ఇంతవరకు హామీని అమలు చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు పాతయాత్రలో అందరి ఆశీస్సులతో ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో అందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన హామీని నమ్మి ఓట్లేసి గెలిపిస్తే గత 20, 25 ఏళ్లుగా అవుట్ సోర్సింగ్ పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేస్తానని చెప్పడంతో 151 సీట్లు గెలిపించామన్నారు. గెలిచిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అందలమెక్కితే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను బానిసల్లాగా, వెట్టిచాకిరి చేస్తున్నారని విమర్శించారు. 11వ పిఆర్‌సి ప్రకారం కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఢిల్లీ, ఒరిశా రాష్ట్రాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తరహాలో రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర కమిటీ నాయకులు ఆర్.జె.శేఖర్, ధనాల చిట్టిబాబు, ఎ.రాము, గురుస్వామి, పట్నాల ఈశ్వరమ్మ, డి.గంగ, బి.సరోజ పాల్గొన్నారు.

పెద్దపులి కలకలం

- మండపల్లి పంచాయతీ పరిసరాల్లో పులి అడుగులు
- ప్రజలను అప్రమత్తం చేసిన అటవీశాఖ అధికారులు





కొలతలను సేకరిస్తున్న అటవీశాఖ అధికారులు (ఇన్‌సెట్‌లో పులి అడుగుగా భావించి మార్కు వేసిన అధికారులు)

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని మండపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న బంజరి నారాయణపురం, అమ్మవారి పుట్టుగ, మండపల్లి పరిసర గ్రామాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం జిల్లాకు చెందిన అటవీశాఖ అధికారులు బంజరి నారాయణపురం, అమ్మవారి పుట్టుగా, మండపల్లి పరిసర ప్రాంత పొలాల్లో పరిశీలించారు. జిల్లా అటవీశాఖ అధికారిని నిషా కుమారి, కాశీబుగ్గ రేంజ్ ఆఫీసర్ మురళీకృష్ణ నాయుడు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఐ.రాము, సిబ్బందితో కలిసి పొలాల్లో స్థానికులు తెలిపిన పులి అడుగు జాడలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాల గట్లపై పరిశీలించిన అడుగు జాడలను బట్టి అది పెద్దపులి అయ్యుంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. పెద్దపులి పాదముద్రల కొలతలతో, పొలాల్లో దొరికిన పాదముద్రల కొలతలకు పోలి ఉండడం ఈ అంచనాలకు వస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ఒడిశా సరిహద్దు ప్రాంతంలోనూ, అలాగే పలాస పరిసర ప్రాంతాల్లో పులి సంచరించినట్లు పలువురు తెలిపిన నేపథ్యంలో ప్రజల సైతం అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. శుక్రవారం అర్ధరాత్రి పులి పరిసర గ్రామాల్లో సంచరించినట్లు చెబుతున్నా... గ్రామస్తులెవరూ పులిని చూడలేదని తెలిపారు. అయినప్పటికీ ప్రజలు ఎవరు సాయంత్రం తర్వాత ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, పొలాలకు వెళ్లే సమయంలో సైతం అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పులి సంచారానికి సంబంధించి ఏదైనా ఆచూకీ తెలిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. వన్యప్రాణిపై ఎటువంటి చర్యలకు దిగరాదని, అలా దిగితే శిక్ష అర్హులు అవుతారని హెచ్చరించారు. పరిసర గ్రామాల్లో పులి సంచారం గురించి తెలియడంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అయ్యాయి. కొద్దిరోజుల క్రితం గుర్తు తెలియని జీవి దాడిలో లేగ దూడలు చనిపోయాయని చెబుతున్నారు. అధికారులు తక్షణమే తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ పరిశీలనలో బారువ ఫారెస్టు సెక్షన్ అధికారి రాజేంద్ర, బీట్ అధికారులు వెంకటేష్, దుర్గ దేవి, భానుమూర్తి, పోలయ్య, సురేష్ కుమార్, జోగారావు, బాబూరావు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి కృషి

శాసనసభ స్పీకర్ సీతారాం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని గ్రామీణ రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తొగరాంలో ఎస్‌ఆర్‌పి నిధులు రూ.3.25 కోట్ల అంచనా వ్యయంతో రాగోలు కూడలి నుంచి తొగరాం వరకు పది కిలోమీటర్ల మేర నిర్మించనున్న నూతన రహదారి నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ రోడ్డు సౌకర్యం కల్పించడం ద్వారా ప్రజా రవాణా అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో రహదారుల అభివృద్ధికి కృషి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రహదారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు. సంక్షేమ ఫలాలను ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. అవినీతి రహిత పారదర్శకంగా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయని అన్నారు. గ్రామ వార్డు సచివాలయాల వ్యవస్థ నేడు దేశానికే తలమానికంగా మారిందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తన స్థానాన్ని ప్రజల గుండెల్లో పదిలపరుచుకుని హుందాగా పరిపాలన సాగిస్తున్న వ్యక్తి జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, రోడ్లు భవనాలశాఖ ఎస్ఇ జామి సుధాకర్, ఇఇ రవినాయక్, డిఇ జనార్ధనరావు, సర్పంచ్‌లు, ఎన్ని రామచంద్ర రావు, చిలకలపల్లి సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'రెడ్‌క్రాస్' మానవతా సంస్థ

రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎ.కె ఫరీడా



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎకె ఫరీడా, తదితరులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశంలోనే సేవా గుణం, మనవతా దృక్పథం కలిగిన సంస్థ రెడ్‌క్రాస్ సొసైటీ అని రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎ.కె.ఫరీడా అన్నారు. నగరంలోని అంబేద్కర్ కళావేదికలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌లో ప్రతిఒక్కరూ సభ్యులుగా చేరాలని సూచించారు. రాష్ట్రంలో లక్షా యాభైవేల మంది ఎన్‌సిసి క్యాడెట్లు రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా చేశారని అన్నారు. అత్యధిక సభ్యత్వం కలిగిన మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉందన్నారు. రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సొసైటీ ఒక మిలియన్ యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు నమోదు కాడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వాలంటీర్ల నమోదు కోసం రూపొందించిన http//.irc-sskl.gov.in అనే వెబ్ సైట్‌ను ప్రారంభించారు. ఈ యాప్ లక్షణాలను, పనితీరును ఆయన వివరించారు. యువతకు చదువు, నైపుణ్యంతో పాటు మానవత్వం ఉంటేనే గుర్తింపు ఉంటుందన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో పెద్ద మొత్తంలో యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్ల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో నమోదు కావాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జెఆర్‌సి/వైఆర్‌సి ఒన్ మిలియన్ వాలంటీర్ల నమోదు కార్యక్రమం శ్రీకాకుళంలో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. ఏటా రెడ్‌క్రాస్ శ్రీకాకుళం జిల్లా శాఖ రాష్ట్రస్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. ప్రతి మండలం, స్కూళ్లు, కాలేజీల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ముందుగా జాన్ హెన్రీ జునంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీన, రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ చైర్మన్ ఎ.శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర వైస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ట్రేజరర్ సిహెచ్.వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, కె.సుధీర్, కె.దుర్గాశ్రీనివాస్, నిక్కు అప్పన్న, నిక్కు హరిప్రసాద్, కళ్యాణచక్రవర్తి, నూక సన్యాసిరావు పాల్గొన్నారు.

టిడిపికి సంక్షోభాలు కొత్త కాదు

విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి



మాట్లాడుతున్న లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి సంక్షోభాలు కొత్తకాదని, ప్రతి సారీ ప్రజలే పార్టీకి రక్షణ కవచంగా నిలుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పేర్కొన్నారు. నగరంలోని అరసవల్లిలో ఉన్న కళ్యాణ మండపంలో టిడిపి విస్తృస్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తుందని అన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన పాలనలో కూల్చివేతలు, దాడులు, నెత్తుటి మరకలతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. పోలీసులతో పాటు ఇతర వ్యవస్థలను చేతుల్లో ఉంచుకుని ప్రజలను అనేక రకాలుగా వేధిస్తున్నారని ఆరోపించారు. సంక్షేమం పేరుతో అభివృద్ధిని పక్కన పెట్టారని, మరోవైపు అనేక రకాలైన పన్నుల పేరుతో ప్రజలను పీడించుకుని రూ.వేల కోట్లు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నిస్తున్న కారణం చేత టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబును 50 రోజుల పాటు జైల్‌లో పెట్టి ప్రాణాలకు ముప్పు వాటిల్లే రీతిలో మాట్లాడుతున్నారని అన్నారు. ఆయనకు ఎటువంటి నష్టం జరిగినా ప్రజాక్షేత్రంలో జగన్ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. టిడిపి శ్రేణులు మరింత విస్తృస్థాయిలో ప్రజల్లోకి ఈ అంశాలను తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్లమెంట్ కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎంపిపిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా కేసులపై ప్రత్యేక దృష్టి

ఎస్‌పి జి.ఆర్ రాధిక



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రాధాన్యత కేసులపై దృష్టి సారించి, అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులు వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలని ఎస్‌పి పి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని డిఎస్‌పిలతో, సిఐలతో, ఎస్‌లతో సెప్టెంబరు నెలలో నమోదైన కేసులపై, గ్రేవ్ నేరాలు, ఎస్‌సి, ఎస్‌టి, దిశ, పోక్సో, రోడ్డు ప్రమాదాలు, చీటింగ్, సైబర్ నేరాలు, పెండింగ్ కేసుల పురోగతిపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్లపై ఉన్న పెండింగ్ కేసుల దర్యాప్తు త్వరగా పూర్తిచేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లపై దృష్టి పెట్టాలని, పోలీసుస్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు భాగస్వాములైన కేసులు ప్రాధాన్యతా క్రమంలో ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని తెలిపారు. ప్రతి పోలీసు స్టేషన్‌లోనూ పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వేగవంతం చేసి విచారణ చేపట్టి పరిష్కారించాలన్నారు. ప్రతి కేసునీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సాక్ష్యాధారాలు సేకరణలో సాక్షిలను విచారణలో జాగ్రత్తలు పాటించాలన్నారు. దర్యాప్తు వేగవంతం చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన ప్రతి కేసునూ సిసిటిఎన్ఎస్ వివరాలు ఎప్పటికప్పుడు పొందుపరచాలని సూచించారు. అపరిష్కృతంగా ఉన్న కేసులను పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సంప్రదించి చర్చించాలన్నారు. ప్రతి కేసు విషయంలోనూ విచారణ త్వరితగతిన పూర్తి చేసి దానికి తగిన విధంగా బాధితులకు న్యాయం చేయాలని తెలియజేశారు. చీటింగ్, సైబర్ కేసులు దర్యాప్తు, వాటి పురోగతిపై సమీక్షస్తూ ప్రతికేసుపైనా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణకు ముఖ్యమైన కూడళ్లలో బారికేడ్లు, ప్రమాద హెచ్చిరిక సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలపై జరిగిన నేరాలైన ఫోక్సో, ఇతర చట్టాల కింద నమోదైన కేసుల్లో దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు నివారణ, ఆస్తి నేరాలు ఛేదన, నియంత్రణ, కేసులు దర్యాప్తు వేగవంతం అంశాలపై ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. సమీక్షలో ఆదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు, డిఎస్‌పిలు వై.శృతి, కె.బాలరాజు, జి.నాగేశ్వరరెడ్డి, డి. బాలచంద్రారెడ్డి, జి.వి.ప్రసాద్, వాసుదేవ్, విజయ కుమార్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.మల్లేశ్వరరావు, ఆదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కె.శంకరరావు, వై.కృష్ణచంద్, శివకుమార్, ఎపిపిలు నాగభూషణం, సుశీల, ఎఒ గోపీనాథ్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సామాజిక అస్త్రం ఫలించేనా?



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీల మద్దతు కూడగట్టేందుకు యాత్రలకు వైసిపి స్వీకారం చుట్టింది. ప్రధానంగా ఆయా తరగుతల జనాభా అధికంగా ఉన్న నియోజకవర్గాలపై దృష్టి సారించింది. యాత్రల ద్వారా వారి మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ సామాజిక అస్త్రం ఎంత వరకు ఫలిస్తుందో, రాజకీయంగా వైసిపికి ఏ మేరకు కలిసి వస్తుందో వేచి చూడాల్సి ఉంది. ప్రస్తుతానికి మాత్రం సభలు నిర్వహిస్తున్న చోట్ల పేలవంగానే సాగుతున్నాయి. ఇచ్ఛాపురంలో నిర్వహించిన తొలి సభకు జనాలను సమీకరించడానికి స్థానిక నాయకత్వం నానా పాట్లు పడింది. ఎస్‌హెచ్‌జి మహిళలను, వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారిని బలవంతంగా తీసుకొచ్చారన్న విమర్శలు వినిపించాయి. సభకు వచ్చిన జనం చివరి వరకు ఉన్నారంటే అదీ లేదు. సభలో నలుగురు నేతలు మాత్రమే మాట్లాడగా... చివరిగా రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడే సమయానికి సగం కుర్చీలు ఖాళీ అయిపోయాయి. సాధారణంగా ప్రభుత్వం ఏదైనా పథకం ద్వారా లబ్ధి కలిగిస్తుందంటే వచ్చిన జనం చివరి వరకు ఓపికగా ఉంటారు. అవేవీ లేకుండా కేవలం ప్రసంగాలు చెప్తామంటే వినడానికి పెద్దగా ఆసక్తి చూపే పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి హాజరవుతున్న సభలకే జనం చివరి వరకు ఉండని పరిస్థితిని మనం చూస్తున్నాం. ఇక మంత్రులు, ప్రజా ప్రతినిధుల సభల పరిస్థితి వేరే చెప్పనక్కర్లేదు.

మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకుల ప్రసంగాల్లోనూ కొత్త దనమేదీ కనిపించలేదు. ఆత్మస్తుతి, పరనిందగానే సాగాయి. టిడిపి హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, జిల్లా నుంచి వలసలు మాత్రం పెరిగాయంటూ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పుకొచ్చారు. దేశంలో ఎక్కడికి వెళ్లినా జిల్లా వాసులే కనబడేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి మారిందంటూ చెప్పడం ఆత్మవంచనే అవుతుంది. వైసిపి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నాలుగున్నరేళ్లలో జిల్లాకు ఏం పరిశ్రమలు తీసుకొచ్చారని, వలసలు ఆగాయో అమాత్యులు వారే చెప్పాలి. ఎడాపెడా పెంచుతున్న విద్యుత్ ఛార్జీలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవతుంటే... దానినీ సమర్ధించుకునే ప్రయత్నం చేశారు. దేశవ్యాప్తంగానే విద్యుత్ వినియోగం పెరిగిందని, దాని ఫలితంగానే ఛార్జీలు పెరిగాయంటూ చెప్పుకొచ్చారు. 2014-19 కాలంలో వాడిన విద్యుత్‌కు, ఆ తర్వాత సంవత్సరాల్లో వినియోగించిన విద్యుత్‌కు ట్రూ అప్, ఇంధన సర్దుబాటు ఛార్జీలు ఇలా రకరకాల పేర్లతో ప్రభుత్వం వసూలు చేస్తోంది. దీనిని విద్యుత్ వినియోగం పెరిగిందనే పేరుతో ధరలు పెరిగాయని చెప్పడం ప్రజలను వంచించడమే అవుతుంది. ఉద్దానం ప్రాంతానికి గతంలో ఎవరూ ఏమీ చేయలేదని, తమ ప్రభుత్వం రక్షిత తాగునీటి పథకం, కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిని కేటాయించామంటూ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పుకొచ్చారు. ఉద్దానం ప్రాంతంలో ఇప్పటికీ కిడ్నీ బారిన పడి ప్రజలు మృత్యువాత పడుతూనే ఉన్నారు. కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి, ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ రకమైన ఉపశమన చర్యలేవీ ఈ ప్రభుత్వమూ చేయలేదన్న బాధ బాధితుల్లో ఉంది.

బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ తరగతులకు ఆర్థిక పరిపుష్టి చేశామని, వారి జీవన ప్రమాణాలు పెంచిందంటూ బొత్స చెప్పుకొచ్చారు. అసలు వాస్తవాలను విస్మరించారు. ఆయా తరగతుల సంక్షేమానికి ఉద్దేశించిన కార్పొరేషన్ల పరిస్థితి ప్రస్తుతం ఎలా ఉందో చూస్తున్నాం. ఉదాహరణకు ఎస్‌సి కార్పొరేషన్ పరిస్థితే తీసుకుందాం. ఈ సామాజిక తరగతి కోసం చాలా కాలం నుంచి ప్రత్యేకంగా కార్పొరేషన్ పనిచేస్తూ వస్తోంది. 2019 వరకు కార్పొరేషన్ కార్యకలాపాలు బాగానే ఉన్నా... ఆ తర్వాత కాలం నుంచి నిస్తేజంగా మారింది. గతంలో కార్పొరేషన్ ద్వారా భూ అభివృద్ధి పథకం కింద భూములు కొనుగోలు చేసి ఎస్‌సిలకు ఇచ్చేవారు. నాలుగేళ్లుగా ఒక్కరికీ ఒక్క సెంటు భూమీ ఇవ్వలేదు. ఎస్‌సి యువతకు వివిధ రకాల యూనిట్ల ఏర్పాటుకు రుణాలు ఇచ్చేవారు. వాటినీ ఆపేశారు.

ఎస్‌సి సబ్‌ప్లాన్ కింద 16 శాతం నిధులను వీటి కోసం ఖర్చు చేసేవారు. సామాజిక పింఛన్లు పొందుతున్న ఎస్‌సి లబ్ధిదారులకు ఇచ్చిన సొమ్మునే 16 శాతం కింద చేసిన ఖర్చులో చూపడం ఈ ప్రభుత్వానికే చెల్లింది. వీటితో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో లబ్ధిదారులుగా ఉన్న ఎస్‌సి మహిళలు, యువతకు ఇచ్చిన డబ్బులనూ సబ్‌ప్లాన్ కింద వెచ్చిస్తున్నట్లు చూపుతున్నారు. ఎస్‌టి సబ్‌ప్లాన్, బిసి, మైనార్టీ సంక్షేమశాఖ పరిస్థితీ అందుకు భిన్నంగా ఏమీ లేదు. ఆయా తరగతులు డైరెక్ట్ బెనిఫిట్ స్కీం (డిబిటి) ద్వారా పొందుతున్న సొమ్ములనే వారి సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్న గణాంకాల్లో చెప్తున్నారు. ఇది ఇలా ఉండగా ప్రభుత్వం ఇటీవల కాలంలో తీసుకున్న ఓ నిర్ణయం ఎస్‌సిలకు నష్టం తెచ్చి పెట్టేలా ఉంది. ఆసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించే పేరుతో 2003, జూలై 31కు ముందు కేటాయించిన భూములపై ఆంక్షలు తొలగిస్తూ ఈ ఏడాది జూలై 27న ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఆర్డినెన్స్ ద్వారా ఎస్‌సిలకు కేటాయించిన భూములను క్రయవిక్రయాలు చేసుకునే వీలు పడుతుంది. జిల్లాలో 2003కు ముందు 38,868.72 ఎకరాలను కేటాయిస్తే అందులో పేదల సాగులో 14,852.61 ఎకరాలు మాత్రమే సాగులో ఉంది. మిగిలిన 24,016 ఎకరాలు పెద్దల ఆధీనంలో ఉన్నట్లు ఈ సందర్భంగా నిర్వహించిన సర్వేలో తేలింది. పేదల అవసరమే ఆసరాగా చేసుకుని గ్రామాల్లోని భూస్వాములు, నాయకులు పేదల నుంచి తక్కువ ధరకు అనధికారికంగా కొనుగోలు చేసి తమ పరం చేసుకున్నారు. రియల్ ఎస్టేట్లు, రొయ్యిలు, చేపల చెరువుల కింద వినియోగిస్తున్నారు. భూస్వాములు, నాయకులు కొనుగోలు చేసిన భూములకు నష్టం రాకుండా చేసేందుకే ఆ ఆర్డినెన్స్ తీసుకొచ్చారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఒక వైపు వారికి మేలు చేస్తున్నామటూ ప్రచారం చేసుకుంటోంది. మరోవైపు వారికి నష్టం చేకూరేలా నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ రకమైన సాధికారతను ఆయా తరగతులు అంగీకరిస్తాయా? వైసిపి అనుకున్న రాజకీయ ప్రయోజనం నెరవేరుతుందా? లేదా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

వాల్మీకి జీవితం ఆదర్శనీయం

శ్రీకాకుళం అర్బన్ : వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని జాయింట్ కలెక్టర్ ఎంనవీన్ కొనియాడారు. కలెక్టరేట్‌లోని వెనుక బడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు రుషులవుతారని చరిత్ర చెప్తోందని అన్నారు. మహనీయుల జీవితాన్ని మనం ఆదర్శంగా స్ఫూర్తిగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలన్నారు. ప్రతిఒక్కరూ జీవిత లక్ష్యాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. అందుకే వారిని మనం స్మరించుకుంటున్నామన్నారు. డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ అధికారి అనురాధ, బిసి సంఘాల నాయకులు పి.చంద్రపతి రావు, దేవభూషణరావు, నారాయణరావు, త్రినాథ రావు, రంగజీ దేవ్, గణపతాచారి పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో ప్రజలకు రక్ష


పోలాకి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి- పోలాకి

ఆరోగ్య సురక్షతో ప్రజలకు రక్షని ఎంఎల్ఎ ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శనివారం గాతలవలస పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ వైద్యసేవలు విస్తరింప చేయాలనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇందులో అనేక రకాల వ్యాధులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నారని, సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయిడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు, రాయిల మల్లేశ్వరరావు, చింతాడ ఉమా, చింతు రాఘవరావు, డిటి పి. శ్రీనివాసరావు, ఎంపిసో ఉషశ్రీ, వైద్యులు శ్రీనాథ్, రత్నరాజు, చందన్, ఎన్.రవికుమార్, కార్యదర్శి సూర్య నారాయణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం: అర్జునవలస గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రణస్థలం మండల మహిళా అధ్యక్షులు గురాన మానస, మండల మహిళా సమైక్య అధ్యక్షులు రామిశెట్టి లక్ష్మి, అర్జునవలస పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి మీసాల రామునాయుడు, వైసిపి నాయకులు రామిశెట్టి మహేష్, సిరిపురపు శ్రీరామ్, పొదిలాపు భాష, కోట్ల అప్పలస్వామి, ఆల్తి రోహిణి కుమార్, గిడిజాల కృష్ణారెడ్డి బొమ్మలాట తవిటియ్య, ఎఌ ధనుంజయరావు, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, వైద్యులు సుమన్, కృష్ణచైతన్య, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలో హరిదాసుపురం గ్రామంలో సర్పంచ్ కణితి ధనలక్ష్మి నారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన జనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, మండల వైసిపి అధ్యక్షులు తమిరి ఫాల్గుణరావు, మండల జెసిఎస్ కన్వీనర్ జడ్యాడ జయరాం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి కనితి రామచంద్రుడు, అంబోడి విష్ణు, రోణంకి ధర్మారావు, ఆశ వర్కర్లు అంగన్వాడి కార్యకర్తలు, పంచాయతీ సెక్రెటరీ, వలంటీర్లు, పాల్గొన్నారు.

కవిటి: మండలం వరక పంచాయతీలో శనివారం జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కడియాల ప్రకాష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శేఖర్, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ సావిత్రి పురియా, ఎంపిటిసి పి.కృష్ణారావు, నాయకులు నర్తు శివాజీ, శ్రీకాంత్ పురియా, ఎస్‌పి ప్రవీణ్, అంగన్వాడీ సూపర్ వైజర్లు కృష్ణవేణి, పల్లవి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: పల్లిసారదిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ప్రతినిధి వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ఉప్పరపెల్లి నీలవేణి పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తిన కుసుమకుమారి, హేమంత్, మండల పరిషత్ ప్రత్యేక అహ్వానితుడు ఉప్పరపెల్లి ఉదయ్ కుమార్, మండల సచివాలయ కన్వీనర్ వడ్డీ కరుణాకర్, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, అంగన్వాడి సూపర్‌వైజర్ లత, డిటి గిరిరాజ్, ఇఒపిఆర్‌డి తిరుమలరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


సోంపేట : మాట్లాడుతున్న ఎంపిపి దాసు

కొత్తూరు: మండలంలో వసప గ్రామంలో శనివారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచ్ వలురౌతు ఆఫీస్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కోశాధికారి, పాతపట్నం నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ తులసివర ప్రసాదరావు, కోయిలాపు సంజీవరావు, ఎం.ప్రతాప్, అగతముడి నాగేశ్వరావు, కలమట తిరుపతిరావు, ప్రశాంత్ కుమార్, బూడిద రఘు, వైద్యులు పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని రావిపాడులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, పోలాకి జడ్పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య, జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్మోహనరావు, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, ఎంపిడిఒ అప్పారావు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేదలకు స్థానికంగానే మెరుగైన వైద్యం అందుతోందని ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు అన్నారు. మండలంలోని ఇసుకలపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి తిరుపతి, వైసిఇప జిల్లా కార్యదర్శి బైపల్లి రామారావు, వార్డు మెంబర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలో గంగరాంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి, వైసిపి నాయకులు డాక్టర్ కిల్లి కృపారాణి, దువ్వాడ వాణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేడాడ జోత్న వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, కవిటి రామరాజు, ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, డిటి ఆర్. మధు, ఇఒపిఆర్‌డి బొడ్డేపల్లి రామారావు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రణస్థలం: వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

పొందూరు: మండలం కోటిపల్లి గ్రామంలో కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, సర్పంచ్ ప్రతినిధి గురుగుబెల్లి అసిరినాయుడు, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, వైద్యాధికారులు శివశంకర్, జి.రమేష్‌నాయుడు, సిహెచ్ఒ వాణీకుమారి, సూపర్‌వైజర్ మణిప్రసాద్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: మండలంలోని పెద్దపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా 24 మందికి విద్యార్థుల నేత్రాలను పరీక్షించారు. అవసరమైన వారికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ కె.త్రినాథరావు ఉచిత కళ్లద్దాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, ఆప్తాలమిక్ అధికారులు డి.రాజశేఖర్‌రెడ్డి, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

సాగునీరు అందించరూ...

ప్రజాశక్తి- బూర్జ

నాగవలి నది ఓపెన్ హెడ్ ఛానల్ ద్వారా సాగునీరు ఇప్పించాలని ఉవ్వపేట వావాం రైతులు స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరారు. చేతికి వచ్చిన పంట వర్షాలు లేకపోవడం వల్ల రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఓపెన్ హెడ్ ఛానల్ ద్వారా ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. అలాగే ఉవ్వ పేట, వావాం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నెన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ కండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, డిసిసిబి డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, సర్పంచ్ గొలివి మంజుల, మాజీ సర్పంచ్ బట్నా వెంకటనాయుడు, గోలివి గోపాలరావు, చింత విశ్వనాధం, వడ్డాది రమణ, సురపు అప్పన్న పాల్గొన్నారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంఇఒలు, ఉపాధ్యాయులు

10న సైన్స్ ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్ష నవంబర్ 10వ తేదీన నిర్వహించటం జరుగుతుందని స్థానిక మండల విద్యాశాఖాధికారులు ఎస్.అప్పలరాజు, ఎల్.వి. ప్రతాప్‌లు అన్నారు. శనివారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయ అవరణలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను అవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో గల అన్ని యాజమాన్యాలలో గల 8, 9, 10వ తరగతి విద్యార్థులచే చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్ష నిర్వహించి శాస్త్రీయ దృక్పదాన్ని కలిగించాలని ప్రధానోపాధ్యాయులను సూచించారు. అలాగే జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ గత 35 సంవత్సరాల నుంచి చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా పాఠశాల స్థాయిలో నవంబర్ 10న, మండల స్థాయిలో నవంబర్ 30న, జిల్లా స్థాయిలో డిసెంబర్ 17న, రాష్ట్ర స్థాయిలో 2024 సంవత్సరం జనవరి 27, 28వ తేదీలలో ఈ ప్రతిభా పరీక్షలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవివి నాయకులు సామ సంజీవరావు, ఆర్. నీలకంఠేశ్వరరావు, తంగి రవణమూర్తి, డి. గణపతిరావు, జి. నారాయణరావులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సినీ హీరో రక్షిత్

'నరకాసుర' చిత్ర బృందం సందడి

పలాస : 1978 పలాస సినిమా ఇక్కడ షూటింగ్ చేయడం వల్ల ఆ సినిమాకు ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిందని, నా జీవితంలో పలాస ప్రాంతాన్ని ఎన్నడూ మరిచిపోనని నరకాసురు చిత్రం హిరో అట్లూరి రక్షిత్ అన్నారు. కాశీబుగ్గ రవిహరి శంకర్ థియేటర్ ఆవరణలో నరకాసురు చిత్రం ట్రైలర్, ప్రోమోను చిత్రం యూనిట్ సభ్యులు శనివారం విడుదల చేసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 3న ఐదు భాషల్లో విడుదల కానున్న నరకాసుర చిత్రం ప్రజలు ఆదరించాలని కోరారు. నా మొదటి సినిమా పలాస, రెండో సినిమా నరకాసుర దర్శకులు సబాస్టిన్ మంచి కథను తీసుకువచ్చి చక్కగా డైరక్ట్ చేశారని అన్నారు. ఈ సినిమాలో ఉన్న సబ్జెక్టు అందరికీ అలరిస్తుందని, ఇందులో ఇద్దరు హీరోహిన్లు, సినియర్ నటులు నాజర్, చరణ్ రాజ్ నటించారని తెలిపారు. 1978 పలాస-2 ఎపిసోడ్ కూడా మన పలాసలో షూటింగ్ తీస్తామని అన్నారు. ఇది ఒక కొత్త చిత్రంగా యువకులకు ట్రెండ్‌ను సృష్టిస్తుందన్నారు. పలాస-కాశీబుగ్గ ప్రజలు ట్రైలర్ వద్దకు అదిక సంఖ్యలో చేరుకొని చిత్రం బృందంతో సెల్ఫీలకు ఎగబడ్డారు. హిరోహిన్లు అపర్ణసంగీత, నటులు గారా. రాజారావు, థియేటర్ యాజమని టి.వీర్రాజు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న రవికుమార్

జైల్లో ఉన్నా బాబు బుద్ధి మారలేదు

ఆమదాలవలస: చంద్రబాబు నాయుడు దాదాపుగా 50 రోజుల నుండి జైల్‌లో ఉన్నప్పటికీ ఆయన బుద్ధిలో ఎటువంటి మార్పు రాలేదని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం హైకోర్టులో బెయిల్ పిటీషన్ విషయంలో మరోసారి చంద్రబాబు అసలు రంగు బయట పడిందన్నారు. ఎల్లకాలం వ్యవస్థలను మేనేజ్ చేయలేరని అంతిమంగా న్యాయమే గెలుస్తుందని రవికుమార్ ఉద్ఘాటించారు. చంద్రబాబు మధ్యంతర అత్యవసర బెయిల్ పిటిషన్ జస్టిస్ జ్యోతిర్మయి దగ్గర నుంచి తప్పించాలని ఇప్పటివరకు ఎటువంటి సంబంధంలేని జీవియల్ మూర్తి అనే ఒక న్యాయవాదితో చంద్రబాబు పిటీషన్‌కు వకాలత్ వేయించి, విలువలకు కట్టుబడిన జస్టిస్ జ్యోతిర్మయితో 'నాట్ బిఫోర్ మి' అని చెప్పించుకుని, వెకేషన్ జడ్జీలుగా ఉన్న మిగతా ఇద్దరు జడ్జీలు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ అడుసుమిల్లి రవీంద్రబాబు బెంచ్‌లకు చేర్చాలన్నదే చంద్రబాబు తపన అన్నారు. ఈయనతో పాటు కెప్టెన్ పైడి రామారావు, అన్నెపు కృష్ణ, రామ్మోహన్, రాజశేఖర్, సంతోష్ ఉన్నారు.

శాశ్వత భూహక్కుతో ప్రయోజనాలు

కంచిలి: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం వల్ల లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుందని ఎస్సార్సీపురం సర్పంచ్ ప్రతినిధి డొక్కరి బలరాం అన్నారు. మండలంలోని ఎస్సార్సీపురంలో శనివారం జగనన్న శాశ్వత భూహక్కు పథకంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రైతుకూ తమ భూమిపై శాశ్వత హక్కును కల్పించేందుకు ఈ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న బలరాం

రక్తదాతలు ప్రాణదాతలు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పిలుపునిచ్చారు. మీరు చేసే రక్త దానం వల్ల అనేకమంది పేద వారు ప్రాణాలు కాపాడుగలరని స్పష్టం చేశారు. పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు ఉద్యోగులకు ఉచిత వైద్య పరీక్షలు, జిల్లా సర్వజనాస్పత్రి ఆధ్వర్యాన రక్తదానం శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, రక్తదాన శిబిరాల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా పోలీసు ఉద్యోగులకు ఏర్పాటు చేశామని అన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు జిల్లా వ్యాప్తంగా సబ్ డివిజన్ స్థాయిలోనూ నిర్వహిస్తున్నామని తెలిపారు. అమర వీరుల త్యాగాలు గుర్తుగా సిబ్బంది రక్త దానం చేయడానికి ముందుకు రావడం ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. ఉద్యోగులందరికీ ఉచితంగా ఇసిజి, సుగర్, బి.పి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు, పోలీసు యూనిట్ డాక్టర్ సిహెచ్.విజయకుమార్, మెడికవర్ ఆస్పత్రి వైద్యులు, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు విభాగం ఆర్ఐలు ఉమ మహేష్, డి.సురేష్ పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకి జీవితం నేటికీ ఎంతో ఆదర్శనీయమని ఎస్‌పి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వాల్మీకి మహర్షి సమాజానికి అందించిన మహా కావ్యం రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు, డిఎస్‌పిలు కె.బాలరాజు, వై.శృతి, జి.నాగేశ్వరరెడ్డి, డి.బాలచంద్రారెడ్డి, జి.వి.ప్రసాద్, వాసుదేవ్, విజయకుమార్, ఎఌ గోపీనాథ్ పాల్గొన్నారు.

పలాస : రక్తదానం వలన మరొకరి ప్రాణాన్ని కాపాడుతుందని కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం పోలీసు వారోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో రక్తదానం, మెగా వైద్యశిబిరం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రక్తదాన శిబిరాన్ని డిఎస్‌పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఏడాదిలో రెండుసార్లు రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. వారిచ్చిన రక్తాన్ని అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వ్యక్తుల ప్రాణాలను నిలబెడుతుందన్నారు. ఈ శిబిరంలో 57 మంది రక్తదానం చేశారు. అనంతరం సుమారు 220 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో కాశీబుగ్గ ఇన్‌ఛార్జి సిఐ రవిప్రసాద్, కాశీబుగ్గ ఎస్ఐ ఖాధర్ భాషా, వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


పలాస : రక్తదానం చేస్తున్న డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ కలసి శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. అనంతరం ఆలయంలో స్వామివారికి నిర్వహించే పలు సేవల్లో పాల్గొన్నారు. సేవల అనంతరం అనివేటి మండపంలో వారికి శేషవస్త్రాన్ని, చిత్రపటాన్ని ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. అలాగే తిరుపతికి చెందిన ఎస్.అజ్మల్, మెహరున్ దంపతులూ అరసవల్లి సందర్శించారు. అనివేటి మండపంలో ఇఒను కలసి నిత్యాన్నదాన పథకానికి రూ.1,02,116 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న చంద్రమోహన్, రాజు

అండగా ఉంటాం

కవిటి: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే జనసేన లక్ష్యమని జనసేన రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్, ఇచ్ఛాపురం జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు అన్నారు. కవిటి మండలం లండారిపుట్టుగ గ్రామానికి చెందిన జనసేన క్రియా శీలక సభ్యుడు నర్తు జోగారావుకు రూ.50వేల ప్రమాదబీమా చెక్కును శనివారం అందించారు. అనంతరం పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ వ్యవస్థలను, రాజకీయాలను భ్రష్టు పట్టించిన వైసిపికి చరమగీతం పాడాలంటే జనసేన-టిడిపి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. దాసరి రాజు మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం మొదటిసారి వచ్చిన రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్‌ను జనసేన నాయకులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బైపల్లి ఈశ్వరరావు, మత్స్యకార వికాస విభాగ రాష్ట్ర కార్యదర్శి నాగుల హరి బెహరా, భూపతి అర్జున్ రాజు, డొక్కరి ఈశ్వరరావు, మీసాల రవికుమార్, పైడిరాజు, శైలజ, సరస్వతి, దుగాన దివాకర్, కాళ్ల దాలయ్య పాల్గొన్నారు.

15న 'చలో విజయవాడ'


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రణస్థలం: సిపిఎం ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను, నవంబర్ 15న ఛలో విజయవాడ జయప్రదం చేయాలని సిపిఎం మండల శాఖ కార్యదర్శి సిహెచ్ అమ్మన్నాయుడు, వెలమల రమణ పిలుపునిచ్చారు. శనివారం సిపిఎం ప్రజారక్షణ భేరి పోస్టర్లను, ప్రజా ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబరు 2న మందసలో సిపిఎం అఖిల భారత నాయకులు విజూ కృష్ణన్ ప్రజా రక్షణభేరి రాష్ట్ర బస్సు యాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు అత్యధిక ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైల్వేజోన్, విభజన హామీలు అమలు వంటివాటితో కూడిన ప్రజాప్రణాళిక సిపిఎం ప్రజల ముందుంచుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయుకులు కె.గురునాయుడు పాల్గొన్నారు.

కళావెంకటరావు పరామర్శ

లావేరు : మాజీమంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు శనివారం మండలం లోని పలువురుని పరామర్శించారు. కేసవరాయ నిపాళెం గ్రామానికి చెందిన మాజీ జెడ్‌పిటిసి రాజాపంతుల ప్రకాశరావు తల్లీ ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందారు విషయం తెలుసుకున్న ఆయన ప్రకాశరావును పరామర్శించారు. అనంతరం చిన్న మురపాక మాజీ సర్పంచ్ సిరిపురపు జగన్నాధం సోద రుడు నరసింహులుకు ఇటీవల శస్త్ర చికిత్స జరగటం తో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. టిడిపి మండల అధ్యక్షుడు ముప్పడి సురేష్, ఎఎంసి మాజీ ఛైర్మన్ యినపకుర్తి తోటయ్య దొర, మధుబాబు, సన్యాసప్పలనాయుడు ఉన్నారు.


అవార్డు అందుకుంటున్న శిరీష, వెంకన్న చౌదరి

లచ్చన్న పేరుకు మరో గౌరవం

ప్రజాశక్తి- పలాస

తమ తాతయ్య పేరిట నడిపిస్తున్న గౌతు లచ్చన్న ఆర్గనైజేషన్ ఫర్ వీకర్ సెక్షన్స్ (గ్లో)కు మరో అరుదైన గౌరవం దక్కిందని ఆ సంస్థ నిర్వాహకులు గౌతు శిరీష, వెంకన్న చౌదరిలు అభిప్రాయం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్ర వైద్య కళాశాల శత వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లో సంస్థ ప్రతినిధులైన తమకు ఎఎంసిఎఎన్ఎ(ఆంధ్ర మెడికల్ కాలేజీ ఆల్ మిన్ ఇన్ నార్త్ అమెరికా) పౌరసన్మానం చేయడం మరింత బాధ్యతలను పెంచినట్లు వెల్లడించారు. విశాఖ ఆంధ్రా మెడికల్ కాలేజీలో చదువుకుని అమెరికాలో స్థిరపడ్డ సీనియర్ వైద్యులు విశాఖపట్నంలో ప్రారంభించిన వైద్య కళాశాల భవన సముదాయ ప్రారంభోత్సవంలో భాగస్వామ్యులను చేసిన వైద్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

బిట్‌వెర్స్ క్రిప్టో ఫేక్ యాప్‌తో టోకరా

పొందూరు: బిట్‌వెర్స్ యాప్‌లో పెట్టుబడులు పెడితే ప్రతిరోజు అధికమొత్తంలో సొమ్మును ఇస్తామంటూ నమ్మబలకడంతో తామంతా నమ్మి పెట్టుబడి పెట్టి మోసపోయామంటూ విశాఖపట్నంకు చెందిన పలువురు బాధితులు వాపోయారు. బిట్‌వెర్స్ క్రిప్టో ఫేక్‌యాప్‌తో శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం తాణెంకు చెందిన వ్యక్తితో పాటు, మరో ఇద్దరు సుమారు రూ.20కోట్లు వరకూ మోసానికి పాల్పడ్డారని బాధితులు ఆరోపించారు. దీంతో విశాఖపట్నంకు చెందిన పలువురు తాణెం గ్రామానికి వచ్చి సదరు వ్యక్తి ఇంటిముందు తమ సొమ్మును తిరిగి చెల్లించాలంటూ నినాదాలు చేస్తూ ఆందోళన జరిపారు. దీంతో వీరి మోసానికి విశాఖపట్నం, విజయనగరం, మన్యం జిల్లాలతో పాటు తెలుగురాష్ట్రాల్లోని సుమారు 500మంది వరకూ రూ.20కోట్లు పెట్టుబడులు పెట్టారని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే ఆమదాలవలస సర్కిల్ సిఐతో పాటు, పొందూరు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న ఎఎస్ఐ రామచంద్రరావు గ్రామానికి చేరుకుని ఇలా ఆందోళన జరపరాదని, ఏదైనా ఉంటే స్టేషన్‌కు వచ్చి చెప్పాలని బాధితులకు చెప్పారు. ఈ విషయంపై జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేస్తామని వారంతా చెప్పి వెళ్లిపోయారు. దీనిపై ఎస్ఐ లక్ష్మణరావు మాట్లాడుతూ ఇదంతా విశాఖపట్నంలో జరిగిందని, అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయాలే తప్పా మాకు సంబంధం లేదన్నారు.

'జగనన్నకు చెబుదాం'పై సమీక్ష

మెళియాపుట్టి: స్పందనలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారునికి సమగ్ర సమాచారం అందించాలని ఎంపిడిఒ చంద్రకుమారి అధికారులకు ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పద్మనాభరావు, మండల పరిషత్ ఎఓ తిరుపతి పట్నాయక్, హౌసింగ్ ఎఇ శ్రీనివాసరావు, ఎపిఎం లలిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి స్పోర్ట్స్‌మీట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాస్థాయి స్పోర్ట్స్‌మీట్‌కు రంగం సిద్ధమైంది. ఏటా జిల్లాలో నిర్వహించే కీర్తిశేషులు కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్, తైక్వాండో ఛాంపియన్‌షిప్-23 పోటీలు ఆదివారం జరగనున్నాయి. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానం వేదికగా నేడు జరగనున్న ఈ అథ్లెటిక్స్ మీట్‌కు దాదాపుగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇందు కోసం అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ఛైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు(వాసు) నేతృత్వంలో నిర్వహణ కమిటీ ముఖ్య ప్రతినిధులు కొన్న సత్యన్నారాయణ, కొన్న మధుసూదనరావు, ప్రగాడ అశోక్‌కుమార్, పూడి బాలాదిత్య, నౌపడ విజయ్ కుమార్, అథ్లెటిక్స్ సంఘ ప్రతినిధులు తదితరులు ఏర్పాట్లపై శనివారం సమీక్షించారు.

నాలుగు వయో విభాగాల్లో పోరు..

జిల్లాస్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో మొత్తం నాలుగు వయో విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. ఈ ఏడాది అథ్లెటిక్స్‌తో పాటు తైక్వాండో క్రీడలోను పోటీలను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం కల్పించారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో వివిధ అథ్లెటిక్స్ ఈవెంట్స్ త్రోస్, రన్స్, జంప్స్ కళాశాల మైదానంలో, తైక్వాండో పోటీలు కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా జరిపించనున్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు, ప్రసంశా పత్రాలను, బహుమతులను అందజేయనున్నారు. క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాల్సి ఉంటుంది.

చిత్రలేఖన పోటీలకు స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థుల్లో శాంతి సౌభ్రాతృత్వం పెంపొందించడానికి లయన్స్ హర్షవల్లి చేస్తున్న కృషి ప్రశంసనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న స్విమ్మింగ్ పూల్ ఆవరణంలో లయన్స్ క్లబ్ హర్షవల్లి ఆధ్వర్యాన శనివారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన ఆయన పిల్లల్లో చిత్రకళ నైపుణ్యాన్ని పెంపొందించేందుకు శాంతి సందేశాన్ని ప్రపంచానికి అందచేయాలన్న సంకల్పం గొప్పదన్నారు. ఈ పోటీల్లో వివిధ స్కూళ్ల విద్యార్థులు ఉత్సహంగా పాల్గొని ప్రపంచ శాంతి అనే అంశంపై చిత్రాలను వేశారు. లయన్స్ క్లబ్ హర్షవల్లి అధ్యక్షులు కరణం శోభారాణి మాట్లాడుతూ తమ క్లబ్ ద్వారా సేవ కార్యక్రమాలు సమాజానికి పనికొచ్చే విధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో సృజనాత్మకత శక్తిని పెంపొందించడానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హారికాప్రసాద్, జిల్లా పర్యాటక అధికారి నడిమింటి నారాయణరావు మెప్మా పీడీ కిరణ్‌కుమార్, లయన్స్ ప్రతినిధులు వావిలపల్లి జగన్నాథం నాయుడు, తర్లాడ అప్పలనాయుడు, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శాసపు జోగినాయుడు, రౌతు శ్రీనివాసరావు గణపతి, పద్మజ, మణిశర్మ పాల్గొన్నారు.


చిన్నారులు గీసిన చిత్రాలను విడుదల చేస్తున్న కమిషనర్ ఓబులేసు

ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను వసూలు

టెక్కలి రూరల్ : మేజర్ పంచాయతీలో ఆన్‌లైన్ ద్వారా ఇంటి పన్నులు వసూలు చేయాలని డిఎల్‌పిఒ ఐ.వి.కుమార్ అన్నారు. డిఎల్‌పిఒ కార్యాలయంలో శనివారం డివిజన్‌లో మేజర్ పంచాయతీ కార్యదర్శులు, బిల్లు కలెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023-24 సంవత్సరం ఇంటి పన్నులు వసూలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కొత్తగా నిర్మాణం చేపట్టిన ఇల్లుకు పన్ను వేసి వసూలు చేయాలన్నారు. పంచాయతీల్లో ఆదాయ మార్గాలతో అభివృద్ధి చేయాలని సూచించారు. సమావేశంలో టెక్కలి కార్యదర్శి మల్లేశ్వరరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వేణుగోపాల్

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి- పలాస

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ నవంబరు 8న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని విద్యార్థి యువజన సంఘ రాష్ట్ర నాయకులు ఎం.యుగంధర్, ఎం.వినోద్‌లు పిలుపునిచ్చారు. శనివారం పలాసలో విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అనేక త్యాగాలతో విద్యార్థి యువజన నాయకులు 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను మోడి ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం నవంబరు 18వ తేదీ నాటికి వెయ్యి రోజులు అవుతుందన్నారు. ఈ సందర్భంగా నవంబరు 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి స్థానిక యువతకి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సిపిఐ జిల్లా నాయకులు చావర వెంకటరమణ, చావర వేణుగోపాల్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు, సిపిఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు బాలకృష్ణ, ప్రజాసంఘ నాయకులు కుసుమ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బడ్డ నాగరాజు, కాంగ్రెస్ నాయకులు శ్యామ్, కష్ణలు పాల్గొన్నారు.